క్లుప్తంగా

మండపేటలో దోమల నివారణ చర్యలు



దోమల నివారణకు సమాయత్తం అవుతున్న కార్మికులు

మండపేట: పట్టణంలో దోమల నివారణకు మునిసిపాలిటీ చర్యలు తీసుకుంటోంది. చైర్పర్సన్ పతివాడ దుర్గారాణి సూచనల మేరకు కమిషనర్ రంగారావు దోమల నివారణ చర్యలు ప్రారంభించారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమం చేపట్టి పట్టణంలోని 30 వార్డుల్లోనూ దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఇన్చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు డ్రైన్లు, చెత్త నిల్వ ఉన్నచోట దోమల నివారణ మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు సందక ఉమామహేశ్వరరావు, పాలపర్తి ప్రసాద్, చుండ్రు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్గా భాస్కరరావు



ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరావుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్గా పేపకాయల భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజోలు డిపో నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ రామచంద్రపురంలో విధులు నిర్వహించిన కొడమంచిలి వెంకటేశ్వర్లు నిడదవోలు డిపోకు బదిలీ అయ్యారు. నూతన డిపో మేనేజర్ భాస్కరరావుకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కాజులూరు: గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టేందుకే 'మన ఊరు–మన సుభాష్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మండలంలోని మంజేరులో శుక్రవారం మంత్రి 'మన ఊరు–మన సుభాష్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శీల, తణుకువాడ, శలపాక, దేగలపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, స్థానిక నాయకులు డాక్టర్ చుండ్రు వీర్రాజుచౌదరి, శీల, శలపాక సర్పంచులు కొమలి వెంకటరమణ, పోతుల గనిరాజు పాల్గొన్నారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

రాయవరం: భానుడు భగభగలాడుతున్నాడు. అప్పుడే వేసవి ప్రవేశించిందా? అన్నట్లుగా ఎండలు కాస్తున్నాయి. వర్షాకాలం–శీతాకాలం సంధికాలంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో సూర్యుడు చూపిస్తున్న ప్రతాపానికి సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. వారం రోజులుగా ఎండలు మండి పోతుండగా శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రత 34 డిగ్రీలుగా నమోదు కాగా, అత్యల్ప ఉష్ణోగ్రత 25 డిగ్రీలుగా నమోదైంది. ఎక్కడికక్కడ శరన్నవరాత్ర ఉత్సవాల సందడి నెలకొంది. ఈ తరుణంలో ఎండలు భక్తుల ఉత్సాహాన్ని కొంతవరకూ నీరు గారుస్తున్నాయి. మధ్యాహ్నం నాలుగు గంటల వరకూ దినకరుడి తీక్షణమైన ప్రభావానికి రోడ్డుపైకి రావాలంటే ప్రజలు జంకుతున్నారు. ఎండల కారణంగా వృద్ధులు, చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా మధ్యాహ్న సమయంలో ఇంచుమించుగా రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్రంగా కాస్తున్న ఎండలకు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరై ప్రయాణాలు చేసే వారు ఎండ నుంచి రక్షణ చర్యలు తీసుకుంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు.

రేపు మాల మహానాడు సర్వ సభ్య సమావేశం

కె.గంగవరం: ఈ నెల 6న మాలమహానాడు సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు మాల మహానాడు నాయకులు రవ్వా భూషణం, కోటి వెంకట్రావు, పెట్టా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కె.గంగవరంలో జరిగిన మాల మహానాడు సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కె.గంగవరం పంచాయతీ ఆవరణలో జరిగే సర్వ సభ్య సమావేశానికి మండలానికి చెందిన సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. సంఘ నాయకులు ఈరెల్ల రాజు, ఎ.అన్నవరం, బత్తుల అప్పారావు, యం. చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

రారండోయ్ వేడుక చూద్దాం..

- గొల్లపాలెంలో ప్రఖ్యాతిగాంచిన ఏనుగుల సంబరం
- శరన్నవరాత్రుల్లో బేతాళునికి విశేష పూజలు
- విజయదశమి రోజున కన్నులపండువగా ఊరేగింపు



గొల్లపాలెంలో పగటి పూట బండిపై ఊరేగిస్తున్న చిన్న ఏనుగు



రాత్రి సమయంలో ట్రాక్టర్పై ఊరేగిస్తున్న పెద్ద ఏనుగు

కాజులూరు: పట్టణ సంస్కృతి పల్లెలకు వ్యాపిస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో సైతం పండగలు, సంబరాలకు ఆదరణ తగ్గిపోతుంది. యాంత్రిక జీవనంతో మనిషి డబ్బు సంపాదించే యంత్రంలా మారి చిన్న చిన్న సరదాలకు సైతం దూరమైపోతున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సైతం అనేక పండగలు, సంబరాలు కనుమరుగైపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో పండగలు నేటికీ వైభవంగా జరుగుతూ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందిస్తున్నాయి.

గొల్లపాలెంలో అత్యంత వైభవంగా...

నియోజకవర్గంలోని గొల్లపాలెంలో ఏనుగుల సంబరం నేటికీ విశేషంగా కొనసాగుతూ ప్రఖ్యాతిగాంచింది. ఏటా విజయదశమిని పురస్కరించుకుని ఇక్కడ ఏనుగుల సంబరాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలోనూ శరన్నవరాత్రుల్లో భక్తులు దుర్గాదేవి అమ్మవారిని పూజిస్తారు. గొల్లపాలెంలో శరన్నవరాత్రుల తొమ్మిది రోజులూ బేతాళుడికి విశేష పూజలు చేస్తారు. చివరి రోజైన విజయదశమి రోజున మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ గ్రామ వీధుల్లో చిన్న ఏనుగునూ, రాత్రి నుంచి మరుసటిరోజు ఉదయం వరకూ ట్రాక్టరుపై పెద్ద ఏనుగును ఊరేగిస్తారు. గ్రామంలో సుమారు 200 సంవత్సరాల నుంచి విజయదశమిని పురస్కరించుకుని ఏటా ఈ ఏనుగుల సంబరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఏడాది పొడవునా రక్షణ

ఐరావతాన్ని తలపించేలా తెల్లని వస్త్రం, ఎండు గడ్డితో తయారు చేసిన ఏనుగు ప్రతిమలకు పెద్ద, పెద్ద చావిళ్లు నిర్మించి ఏడాది పొడవునా స్థానికులు వాటిని పరిరక్షిస్తుంటారు. విజయదశమికి 10 రోజుల ముందు ఏనుగు ప్రతిమలను బయటకు తీసి శుభ్రం చేయడంతో పాటు మెరుగులు దిద్దీ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామంలోని వెలమ సామాజిక వర్గీయుల ఆధ్వర్యంలో చిన్న ఏనుగు సంబరం జరుగుతుండగా కాపు, బలిజ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో పెద్ద ఏనుగు సంబరం జరుగుతోంది. చిన్న ఏనుగును ఎడ్లబండిమాదిరి బండిపై ఉంచి భక్తులు జేజేలు పలుకుతూ తోసుకుంటూ ముందుకు సాగుతారు. పెద్ద ఏనుగునైతే ట్రాక్టరుపై ఉంచి ఊరేగింపు నిర్వహిస్తారు. ఎండుగడ్డి, తెల్లనివస్త్రం తదితర వస్తు సామగ్రితో తయారు చేసిన భారీ ఏనుగు ప్రతిమలను ఊరేగించే సమయంలో వైభవంగా సంబరం జరుగుతుంది. బేతాలుని రూపంలో భక్తులు ఏనుగుల ప్రతిమలకు పూజలు నిర్వహిస్తారు. గరగనృత్యాలు, కోల సంబరాలు, కోయ డ్యాన్సులు, గారడీ, బ్యాండ్ మేళాలతో ఏనుగుల ఊరేగింపు కోలహలంగా సాగుతుంది. ఇరు వర్గాల వారు పోటాపోటీగా సంబరాలు నిర్వహిస్తుంటారు. గతంలో ఏనుగుల సంబరాల్లో ఘర్షణలు జరిగేవి. సుదీర్ఘకాలంగా ఉన్న విభేదాలకు పెద్దలు సఖ్యత కుదర్చడంతో ఇటీవల సంబరాలు సాఫీగా జరుగుతున్నాయి. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను తిలకిస్తారు.

అనాదిగా వస్తున్న ఆచారం



గొల్లపాలెంలో ఏనుగుల సంబరం అనాదిగా వస్తున్న ఆచారం. గ్రామంలో కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ సంబరాల్లో పాల్గొంటారు. జీవనోపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు ఈ సంబరాలకు తిరిగి వస్తుంటారు.

టేకుమూడి దుర్గారావు, గొల్లపాలెం

సంప్రదాయాలను కొనసాగించటం అభినందనీయం



ఆధునిక యుగంలో ప్రతిఒక్కరూ కాస్త తీరిక దొరికితే వెండితెర, బుల్లితెరలకు అతుక్కుపోతున్నారు. పండగలు, సంబరాలను మరచిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో స్థానికులు పురాతన సంప్రదాయాలు కొనసాగిస్తూ నేటికి వైభవంగా ఏనుగుల సంబరం నిర్వహించడం అభినందనీయం.

మేడిశెట్టి వెంకటరమణమ్మ, మాజీ ఎంపీటీసీ, గొల్లపాలెం

సంపూర్ణ పారిశుధ్య నిర్వహణకు కృషి



సమావేశంలో పాల్గొన్న ఆర్పీలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

- మున్సిపల్ కమిషనర్ రంగారావు
- డ్వాక్రా సంఘాల లీడర్లతో సమావేశం

మండపేట: పట్టణంలో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రంగారావు అన్నారు. ఈ దిశగా అడుగులు వేయడానికి మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం డ్వాక్రా సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డ్వాక్రా మహిళలకు పలు సూచనలు చేశారు. తడి పొడి ప్రమాదకర చెత్తలను వేరుచేసి నిత్యం వీధుల్లోకి వస్తున్న పారిశుధ్య కార్మికులకు అందివ్వాలన్నారు. దీనిపై డ్వాక్రా మహిళలంతా సహకారం అందించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా మహిళల్లో చైతన్యం తీసుకురాగలిగితే సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. ఇందుకు డ్వాక్రా ఆర్పీలు కృషి చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా అనేక అనర్థాలు ఉన్నందున ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, క్యారీ బ్యాగులు వంటి వాటి వాడకాన్ని పూర్తిగా తగ్గించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లల్లో పోగైన చెత్తను డ్రెయిన్లలో వేయకుండా చూడాలన్నారు. దీనివల్ల మురుగు పేరుకుపోయి క్రిమికీటకాలు, దోమలు, ఇతర కీటకాలు పెరిగిపోయి ప్రజారోగ్యాన్ని దెబ్బ తీస్తాయన్నారు. వివిధ రకాల కొనుగోళ్లకు మార్కెట్కు వచ్చే ప్రజలు వ్యాపారులు ఇచ్చే ప్లాస్టిక్ కవర్లు మానేసి, గుడ్డ సంచులు మాత్రమే వాడకాన్ని వినియోగంలోకి తేవాలన్నారు. సమావేశంలో మెప్మా సీఎంఎం సుజాత, ఆర్పీలు పాల్గొన్నారు.

ఛిద్రమైన కాలిబాట రక్షణగోడ

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి బ్యాంక్ కెనాల్పై ఉన్న కాలిబాట వంతెన రక్షణ గోడ ఛిద్రమైంది. వంతెన ప్రారంభ భాగంలో చువ్వలు పొడుచుకొస్తూ ప్రమాదభరితంగా మారాయి. తాతపూడి గ్రామంతో పాటు సమీప గ్రామాల ప్రయాణికులు నిత్యం వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఛిద్రమైన తాతపూడి కాలిబాట వంతెన రక్షణ గోడ

చెకుముకి జిల్లా సంబరాలకు ఆరుగురు విద్యార్థులు

కపిలేశ్వరపురం: ఈ నెల 27న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి జిల్లా సంబరాలకు కపిలేశ్వరపురం మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు రెండు బృందాలుగా హాజరు కానున్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి శ్రీనివాస్ శుక్రవారం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.నూతనశ్రీ , కె.రేఖా శ్రీనందన్, కె.దీపికా జ్యోతి, ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి అంగరలోని శ్రీరామకృష్ణా ఉన్నత పాఠశాల నుంచి బి.మేఘనాదేవి, పి.గాయత్రి, ఎస్.లీతిన్లు హాజరు కానున్నారన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి సంబరాల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

రాయవరం మండలం

తహసీల్దారు	9849903905
ఎంపీడీవో	9912191666
మండల విద్యాశాఖాధికారి1	9948523380
మండల విద్యాశాఖాధికారి2	7013074928
పోలీసు స్టేషన్	08857235333
సబ్ఇన్స్పెక్టరు	9440904843
రాయవరం పీహెచ్సీ వైద్యాధికారులు	8309351543, 7013003149
మాచవరం పీహెచ్సీ వైద్యాధికారులు	8501002004, 8639015670
మండల వ్యవసాయాధికారి	8886613579
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో	7702072648
డ్వాక్రా ఏపీఎం	9154081283
మండల ఇంజినీరింగ్ అధికారి	9502377535
విద్యుత్శాఖ ఏఈ	9440812651
హౌసింగ్ ఏఈ	7093930489
మండల పశువైద్యాధికారి	8074154935
ఉద్యానవన శాఖ అధికారి	8712625211
గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ	9100121182

సినిమాలు



రామచంద్రపురం

రాజగోపాల్	స్వాగ్
కిషోర్	దక్షిణ
శ్రీసూర్య	దేవర

ద్రాక్షారామలో

శ్రీలక్ష్మి	సత్యం సుందరం
శ్రీసూర్య	దేవర

గాయత్రీదేవిగా విజయదుర్గా అమ్మవారు



గాయత్రీ అవతారంలో వెదురుపాక విజయదుర్గా అమ్మవారు



సోమేశ్వరం శివాలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



గాయత్రీ అలంకారంలో రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి



విశేషాలంకరణలో అలరారుతున్న సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



మండపేట గాజుల పూజ చేస్తున్న మహిళలు



కొత్తూరు రోడ్డులో గాయత్రీదేవి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



ద్రాక్షారామలో దుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం విజయదుర్గ అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠం అర్చకులు చీమలకొండ వీరావధాని, చీమలకొండ శ్రీనివాస్, కోట లక్ష్మీనారాయణ, నాగేంద్ర శర్మ, చక్రవర్తుల మాధవాచార్యుల అర్చకత్వంలో విజయదుర్గా అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. అలాగే పీఠంలో భక్తులు ఏర్పాటు చేసుకున్న కలశాలకు కూడా పూజాదికాలు నిర్వమించారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ వేదమాత గాయత్రీదేవిని ఆరాధించడం వలన కలిగే శుభాలను వివరించారు. దుర్గాదేవి అవతారాలపై ఆధ్యాత్మికవేత్త శలాక రఘునాథ శర్మ చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారికి ఏకవార రుద్రాభిషేకం, గాయత్రి అష్టోత్తరంతో కుంకుమపూజలు, నవగ్రహ హోమం నిర్వహించారు. పీఠంలోని భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఠం పీఆర్వో వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్ఐవో నరసింహారావు దంపతులు విజయదుర్గా అమ్మవారిని దర్శించుకుని పూజాదికాలు చేశారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో శుక్రవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి, పూజలు, అభిషేకాలు చేశారు.పలు ఆలయాల్లో అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

అలాగే మండలంలోని సోమేశ్వరం, వెంటూరుల్లోని చారిత్రక శివాలయాలైన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారిని గాయత్రీదేవి రూపంలో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్య శర్మ అర్చకత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు విలపర్తి ఫణిధర్శర్మ, శశిధర్శర్మ స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాదికాలు నిర్వహించారు.

మండపేట పట్టణం, మండలంలో..

మండపేట: శ్రీదేవీ శరన్నరాత్ర ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. మండపేట పట్టణం, మండలంలోని 12 గ్రామాల్లో అమ్మవార్లు భక్తుల నీరాజనాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నారు. కలువ పువ్వు సెంటర్, కొండపల్లివారి వీధి, పాటిమీద, సత్యశ్రీ రోడ్డు, గాంధీనగర్ వీధుల్లో కొలువైన అమ్మవార్లు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భవానీ భక్తులు, మహిళలు, చిన్నారులు ఆయా మంటపాల వద్దకు వెళ్లి పూజాదికాలు నిర్వహించారు. స్థానిక కలువపువ్వు సెంటర్ కనకదుర్గ ఆలయ అర్చకుడు అయినవిల్లి రాజరాజేశ్వరశర్మ తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. కుంకుమార్చన చేశారు. రావులపేట జాంపేట వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవారికి ఐదు వేల గాజులతో పూజలు చేశారు. చుట్టుపక్కల వీధుల్లోని మహిళలు భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.

రామచంద్రపురం పట్టణంలో..

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు రోడ్డు జోడుతూముల వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 500 మంది మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ బ్రహ్మ చెరుకుపల్లి గణేష్ శర్మ అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం మాణిక్యాంబ అమ్మవారి గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో పండితులు అమ్మవారికి మేలు కొలుపు, సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, తీర్థపు బిందె, బాలభోగం, ప్రథమాభిషేకం, విశేష పూజలు, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవార్లకు విశేష పూజలు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో రెండోరోజు శుక్రవారం దుర్గాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి అరుణ్కుమార్, త్రిపురమల్లు గోపాల్ పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు రెండోరోజు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివబాలయోగి మహారాజ్ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.



ఆదివారపుపేటలో బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు